# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 04 జూన్, 2026 | పేజీలు :08


## ఎంజిఎం ఆస్పత్రి అభివృద్ధికి సమష్టిగా కృషి



వివరాలు మెయిన్‌లో...

# మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్ నిర్మాణానికి ఎంపి కావ్య శంకుస్థాపన



**ప్రజాపక్షం/కాజీపేట :** హనుమకొండ జిల్లా మడికొండలోని మహిళా ప్రాంగణంలో డిఆర్‌డిఎ, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళా సంఘాల సాధికారతకు తోడ్పాటుగా 1 కోటి 50 లక్షల తో నిర్మించనున్న జిల్లా మహిళ సమాఖ్య పెట్రోల్ బంక్ నిర్మాణానికి స్థానిక శాసన సభ్యుడు కె.ఆర్ నాగరాజుతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతే సమాజ అభివృద్ధికి బలమైన పునాదని అన్నారు.మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళలను లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా యజమానులుగా, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకునే స్థాయికి తీసుకెళ్తోందన్నారు. మహిళలకు అవకాశం కల్పిస్తే వారు ఏ రంగంలోనైనా అద్భుత విజయాలు సాధించగలరని, ఇంటిని చక్కదిద్దే మహిళకు అవకాశం ఇస్తే వ్యాపారం, పరిశ్రమ, వ్యవసాయం, సేవా రంగం ఇలా అన్ని రంగాల్లోనూ తన ప్రతిభను చాటగలరని పేర్కొన్నారు.అదే విధంగా నేడు మడికొండలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని, ఇకపై మడికొండలో మహిళలు నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ ఉంది అని గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.మహిళా సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ కార్యక్రమాలు, సోలార్ రంగం వంటి అనేక రంగాల్లో మహిళలు విజయవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా మహిళలను నాయకత్వ స్థానాల్లో నిలబెట్టే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళలను ప్రోత్సహిస్తోందని చెప్పారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి ఆదాయ వనరులు పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించబడనున్న ఈ పెట్రోల్ బంక్ మహిళలకు స్థిరమైన ఆదాయాన్ని అందించడమే కాకుండా, మరెంతో మందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.మహిళలు కుటుంబానికి, సమాజానికి వెన్నెముకలాంటివారని, వారు ఆరోగ్యంగా, బలంగా ఉంటేనే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని అన్నారు.మహిళల సంక్షేమం, సాధికారత కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇస్తూ, మహిళలు అన్ని రంగాల్లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.నుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, డిఇడిఒ శ్రీనివాస్,బిపిసిఎల్ ఎండి సుధీర్, ముఖ్య నాయకులు, ఐకెపి రీజినల్ కోఆర్డినేటర్లు,సిసిలు, స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# నేటినుంచి అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు

### భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు,.మున్సిపాలిటీలో గ్రామ, వార్డు సభలు సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం ఐడిఒసి కార్యాలయం నుండి జిల్లా ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ .. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 న అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలోని వార్డులలో నిర్వహించనున్న సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. రహదారుల చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి అవెన్యూ ప్లాంటేషన్ లో మొక్కలు నాటాలని తెలిపారు. మురుగుకాల్వలు పరిశుభ్రం చేయుట, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఇండ్ల నుండి వచ్చే మురుగు నీరు రోడ్లపైకి వెళ్ల కుండా కమ్యూనిటి, వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. రానున్న వర్షాకాలంలో గ్రామాలలో పారిశుధ్యం, మురుగు కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, భారీ అకాల వర్షాల వల్ల వాగులు వంకలు పొంగితే తీసుకోవాల్సిన రక్షణ చర్యలు ప్రజలను తరలించేందుకు అవగహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిపిఒ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, వ్యవసాయ అధికారి బాబురావు, డిఆర్‌డిఒ బాల కృష్ణ, విద్యుత్, విద్య, ప్రణాళిక, తదితర శాఖల అధికారులతో పాటు అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఎంఇఒలు, తదితరులు పాల్గొన్నారు.

## మానుకోట సమీకృత కూరగాయల మార్కెట్‌ను తక్షణమే వినియోగంలోకి తేవాలి



వివరాలు మెయిన్‌లో ...

## పక్కా యాక్షన్ ప్లాన్‌తోనే గ్రామ, వార్డు సభలు



మెయిన్‌లో ...

## వేలేరు ఎంపిడిఓగా బాధ్యతల స్వీకరణ

ప్రజాపక్షం / వేలేరు : వేలేరు మండలానికి నూతనంగా బదిలీపై వచ్చి బుధవారం బాధ్యతలు స్వీకరించిన శంకర్‌కు వేలేరు ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది,వేలేరు మండల పంచాయితీ కార్యదర్శులు బుధ వారం వేలేరు మండలకేంద్రంలోని ఎంపిపి కార్యాలయంలో ఎంపిపి కార్యాలయంలో మర్యాదపూర్వకముగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఎపిపి కార్యాలయ సిబ్బంది,మండలపంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాపక్షం/ఖిలావరంగల్:వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఓ సిటిలో గల క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎంఎల్‌సి కొండా మురళీధర్‌రావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఇందిరమ్మ ఇండ్లు రాలేదని కొందరు ఆసుపత్రిలో సమస్యలు ఉన్నాయని ఇంకొందరు తమ తమ సమస్యలను మాజీ ఎంఎల్‌సి కొండా మురళీధర్‌రావు దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన కొండా మురళీ కొన్ని సమస్యలను అప్పటికప్పుడే పరిష్కారం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌సి కొండా మురళీ మాట్లాడు తూ నియోజకవర్గంలోని ప్రజలకు మేము ఎప్పుడు కష్ట నష్టాలలో అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఈ సందర్భంగా కొండా మురళి తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేయడం మా బాధ్యత అని ముఖ్యంగా వరంగల్ తూర్పు ప్రజలకు అలాగే నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.

## పశువైద్యాధికారిని బదిలీ

ప్రజాపక్షం/నెక్కొండ:నెక్కొండ మండల పశువైద్యాధికారి డాక్టర్ మమత బదిలీపై ధర్మసాగర్ మండలానికి వెళ్ళారు. ఆమె స్థానంలో గూడూరు మండలం భూపతిపేటలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రాము నెక్కొండ మండల పశువైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక పశుసంవర్ధక శాఖ సిబ్బంది డాక్టర్ మమతకు వీడ్కోలు పలికి, డాక్టర్ రాముకు స్వాగతం పలికారు. మండలంలోని పశు పాలకులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని డాక్టర్ రాము తెలిపారు.

## ఎస్ఐకి కఠిన సేవా పతకం అవార్డ్

ప్రజాపక్షం/కన్నాయిగూడెం:ములుగు జిల్లా కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐఐనిగాల వేంకటేష్ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక కఠిన సేవా పతకం అవార్డ్ ప్రకటించింది. తెలంగాణ, ఛత్తీస్‌ఘరాష్ట్ర సరిహద్దు ప్రాంతం కటిక మైన భౌగోళిక ప్రాంతలలో సేవలు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో దట్టమైన అడవులు. కొండలు రవాణా కమ్యూనికేషన్ సౌకర్యాలు సరిగ్గా లేని ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన విధినిర్వహణలో చూపిన అంకిత భావం, క్రమశిక్షణ, ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మంగళ వారం ఈ అవార్డ్ ప్రకటించింది. ఈ సందర్భంగా పోలీసు శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కన్నాయిగూడెం మండలం ప్రజలు ఎస్ఐ వెంకటేష్ ను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

## చైతన్యవంతులు కావడం కాంగ్రెస్ నాయకులకు ఇష్టం లేదా?

### వరికోల్ గ్రామ సర్పంచ్ దొగ్గెల కుమారస్వామి



ప్రజాపక్షం /నడికూడ : నడికూడ మండలం వరికోల్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని పురస్కరించుకొని వరికోల్ గ్రామ అభివృద్ధి ప్రదాత శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో నూతన గ్రంథాలయం,కంప్యూటర్లను గ్రామ యువత కోసం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని సర్పంచ్ దొగ్గెల కుమారస్వామి తెలిపారు. వారు మాట్లాడుతూ విజ్ఞాన వికాస కేంద్రాలైన గ్రంథాలయాలపై కాంగ్రెస్ నాయకుల కక్షసాధింపు చర్యలు దుర్మార్గం తీవ్రంగా ఖండిస్తున్నామన్నామని చదువుకునే విద్యార్థులకు,నిరుద్యోగ యువతీ యువకులకు,మేధావులకు ఎంతో ఉపయోగపడే గ్రంథాలయాన్ని (లైబ్రరీ) కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజకీయ స్వార్థంతో వ్యతిరేకించడం అత్యంత దారుణమైన విషయమని విజ్ఞానాన్ని పంచే విద్యా నిలయాలపై కాంగ్రెస్ నాయకులు తమ నైజాన్ని ప్రదర్శిస్తూ, అడ్డుతగలడాన్ని తీవ్రస్థాయిలో ఖండిస్తున్నామని అభివృద్ధి నిరోధకులు కాంగ్రెస్ నాయకులకు,జ్ఞానాన్ని ఇచ్చే పుస్తకాల నిలయం అంటే ఎందుకు అంత కక్ష? సమాజం చైతన్యవంతం కావడం వీరికి ఇష్టం లేదా?రాజకీయ దిగజారుడుతనం: కేవలం రాజకీయ కక్ష సాధింపులు,స్వార్థ ప్రయోజనాల కోసమే అభివృద్ధి పనులను,గ్రంథాలయ నిర్వహణను అడ్డుకుంటున్నారని విద్యార్థుల పక్షాన నిలబడి మేము ఈ చర్యలను తీవ్రంగా నిరసిస్తున్నామని,పెద్ద ఎత్తున యువత మీ ఇంటి ముందు ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నాం.ఇప్పటికైనా గ్రంథాలయానికి వ్యతిరేకంగా చేస్తున్న కుట్రలను ఆపాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వరికోలు గ్రామ ఉపసర్పంచ్ మురాల భుజంగరావు,పాలకవర్గ సభ్యులు పోశాల శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే గుండె వాల్వ్ మార్పిడి

ప్రజా పక్షం /వరంగల్ టౌన్ :గుండె వైద్యరంగంలో వరంగల్ మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదికైంది. వరంగల్ మెడికవర్ హాస్పిటల్స్ కార్డియాలజీ విభాగం వరంగల్ ట్రై సిటీస్ ప్రాంతంలో తొలి స్వతంత్ర ట్రాన్స్‌కాథెటర్ ఏఆర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ టవర్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించి ప్రాంతీయ వైద్య చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించింది.తీవ్రమైన ఛాతీనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండెదడ వంటి సమస్యలతో బాధపడుతూ రోజువారీ కార్యకలాపాలు నిర్వహించలేని స్థితిలో ఉన్న 65 ఏళ్ల మహిళను వరంగల్ మెడికవర్ హాస్పిటల్స్‌లో చేర్చారు. వైద్య పరీక్షల్లో ఆమెకు ప్రాణాంతక పరిస్థితులకు దారితీసే తీవ్రమైన ఏఆర్టిక్ స్టెనోసిస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ వ్యాధిలో గుండె ప్రధాన వాల్వ్ తీవ్రంగా కుంచించుకుపోవడంతో శరీరానికి రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది.రోగి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం హార్ట్ టీమ్ అత్యాధునిక టవర్ విధానం ద్వారా చికిత్స చేయాలని నిర్ణయించింది. 23 మిల్లీమీటర్ల మైవల్ ట్రాన్స్‌కాథెటర్ హార్ట్ వాల్వ్‌ను ఉపయోగించి ఈ క్లిష్ట ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. రోగి వాల్వ్‌లో అధిక కాల్షియం పేరుకుపోవడం, కేవలం 6 మిల్లీమీటర్ల వ్యాసం మాత్రమే ఉన్న రక్తనాళం ద్వారా వాల్వ్‌ను ప్రవేశపెట్టాల్సి రావడం ఈ కేసును మరింత సవాలుగా మార్చింది.సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ షఫీ పాలగిరి నేతృత్వంలో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ వాసు పర్యవేక్షణలో డాక్టర్ శ్రవణ్ రాంపెల్లి, డాక్టర్ సంతోష్ మోదాని సహకారం అందించారు.సుమారు 40 నిమిషాల పాటు సాగిన ఈ ప్రక్రియ ఎలాంటి సంక్లిష్టతలు లేకుండా పూర్తయింది. చికిత్స అనంతరం రోగి ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడగా, కేవలం మూడో రోజే పూర్తి ఆరోగ్యంతో ఇంటికి వెళ్లారు.ఈ సందర్భంగా డాక్టర్ షఫీ పాలగిరి మాట్లాడుతూ, గుండె వాల్వ్ వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఇకపై హైదరాబాద్ వంటి మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ప్రపంచ స్థాయి టవర్ వంటి అత్యాధునిక చికిత్సలు ఇప్పుడు వరంగల్‌లోనే అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా వృద్ధులు, ఓపెన్ హార్ట్ సర్జరీకి అనుకూలం కాని హైరిస్క్ రోగులకు ఈ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది అని తెలిపారు.తవర్ విధానం ఎందుకు ప్రత్యేకం అంటే సంప్రదాయ ఓపెన్ హార్ట్ సర్జరీలో ఛాతీ ఎముకను తెరిచి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. దీంతో రోగి రెండు నుంచి మూడు వారాల వరకు ఆసుపత్రిలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే తవర్ విధానంలో ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా కేవలం క్యాథెటర్ ద్వారా గుండె వాల్వ్‌ను మార్పిడి చేస్తారు. దీనివల్ల శస్త్రచికిత్సకు సంబంధించిన ప్రమాదాలు, నొప్పి, రక్తస్రావం తగ్గడంతో పాటు రోగి చాలా త్వరగా కోలుకుంటారు. సాధారణంగా రెండు నుంచి మూడు రోజుల్లోనే ఇంటికి వెళ్లే అవకాశం ఉండటంతో రోగి తన సాధారణ జీవితంలోకి వేగంగా తిరిగి చేరుకోగలుగుతారు.ఈ విజయవంతమైన చికిత్సతో వరంగల్ మెడికవర్ హాస్పిటల్స్ తెలంగాణలో ప్రముఖ స్ట్రక్చరల్ హార్ట్ కేర్ కేంద్రంగా మరోసారి తన ప్రత్యేకతను చాటుకుందని వైద్యులు పేర్కొన్నారు.

## కెయు పోలీస్ స్టేషన్ సందర్శించిన వరంగల్ సిపి



ప్రజాపక్షం /వరంగల్ క్రైమ్ :భూతగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వ వహిస్తూ సెటిల్‌మెంట్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కెయుసి పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ఏసిపి నర్సింహారావు, ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలికాలికారు. పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలు, స్టోర్, కేసు ప్రాపర్టీగదులు, స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ సంబంధించిన రికార్డులను, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులను పరిశీలిస్తూ, పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా వున్న రౌడీ షీటర్లు, అనుమానితులు ఎవరు, ప్రస్తుతం వాళ్ళు ఎలావున్నారు.ఏం చేస్తున్నారు మొదలైన వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చే రౌడీ షీటర్లతో పాటు బెదిరింపులకు పాల్పడే వారికి ప్రత్యేక కౌన్సిలింగ ఇవ్వాలని, రౌడీ షీటర్ల పట్ల సానుభూతి ధోరణి ప్రదర్శించవద్దని, యాక్టివ్‌గా వున్న రౌడీపై నజర్ పెట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ముఖ్యంగా స్థానికంగా వున్న సామాజిక రుగ్మతలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, విద్యా సంస్థల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, స్టేషన్ ఎస్.ఐలు అప్పగించిన సెక్టార్ పరిధిలో నేరాల నియంత్రించడంతో పాటు, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు.ఈకార్యక్రమములో ఎస్.ఐలు నవీన్ కుమార్, కళ్యాణ్‌కుమార్, రాజమౌళి పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ కోదండరాం,అద్దంకి దయాకర్‌లకు కెయు జెఎసి నాయకుల వినతి

ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం సార్, అద్దంకి దయాకర్ లను కాకతీయ యూనివర్సిటీ ఉద్యమకారులు కలిసి వినతి పత్రం సమర్పించారు. కేయూ జెఏసినాయకులు తమ వినతి పత్రం ద్వారా ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కాకతీయ యూనివర్సిటీని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఉద్యమకారులను గుర్తించాలని, ఉత్తరాఖండ్, జార్ఖండ్ రాష్ట్రాల తరహాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యార్థి ఉద్యమకారులకు ప్రభుత్వ ఉద్యోగాలలో పది శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్ లు సానుకూలంగా స్పందించారు, నాటి (2009–2014) కేయూ జెఏసి చైర్మన్ డాక్టర్ సాదుల రాజేష్, సమన్వయకర్తలు డాక్టర్ మంద వీరస్వామి, కన్వీనర్ కత్తెరపల్లి దామోదర్,డాక్టర్ మాధవి, వైస్ చైర్మన్ డాక్టర్ మేడారపు సుధాకర్, డాక్టర్ సూత్రపు అనిల్, డాక్టర్ చిర్ర రాజు, శ్రీనివాస్ రెడ్డి, క్రాంతి కుమార్, పాల్గొన్నారు.

## మల్లారెడ్డిపల్లిలో ఘనంగా బడిబాట

ప్రజా పక్షం /హసనపర్తి : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా నేడు మల్లారెడ్డిపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభ ఘనంగా జరిగింది. ఈ సభకు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగ కాంతారావు అధ్యక్షత వహించగా గ్రామ సర్పంచ్ శ్రీమతి గాజు కృష్ణవేణి యుగేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని బడిబాట కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో బడిలో చేరేలా చూడాలని, లేనిచో బడి మనుగడ కష్టమౌతుందని తెలిపారు. సుమారు 150 కి పైగా హాజరైన గ్రామ ప్రజలను ఉద్దేశించి ఊరు మనది, బడి మనది, బడిని కాపాడుకునే బాధ్యత కూడా మనదే అనే భావనతో మన పిల్లలను మన ఊరి బడికి పంపించాలని వారికి విజ్ఞప్తి చేశారు. తరువాత పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే ఉత్తీర్ణులైన విద్యార్థులను శాలువాలతో సన్మానించడమే కాకుండా మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థిని బోల్ల ఐశ్వర్యకు 1000 రూపాయలు , రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థిని వస్తం జ్యోతికి 500 రూపాయలు నగదు పారితోషికం అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమారస్వామి, వార్డు సభ్యులు, మాజీ ఉప సర్పంచ్ యుగేందర్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరంజ్యోతి, పాఠశాల శ్రేయోభిలాషి చిరంజీవి, యువజన సంఘాల అధ్యక్షులు, అంగన్వాడీ కార్యకర్తలు,ఉపాధ్యాయులు , తదితరులు పాల్గొన్నారు.



మంగపేటలో:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని బుధవారం జెడ్‌పిహెచ్ఎస్ మంగపేటలో ఘనంగా ప్రారంభి చారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పొదెం మేనక ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి, బడిబాట ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్), ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, బాలికలకు కరాటే శిక్షణ, అనుభవజ్ఞులైన శిక్షణ పొందిన ఉపాధ్యాయుల సేవలు వంటి అనేక సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు ప్రభుత్వం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనేక ప్రోత్సాహక కార్యక్రమాలను అమలు చేస్తోందని, అందువల్ల గ్రామంలోని ప్రతి బాలబాలికలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రాంతి వెంకటేశ్వర్ రెడ్డి, సతీష్ కుమార్, తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు గ్రామ ప్రజాప్రతినిధులు గ్రామస్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

**ప్రజాపక్షం/గూడూరు;** గూడూరు మండలం లోని బోలెపల్లి గ్రామ ఎస్‌సికాలనీకి చెందిన వసుకుల ఎల్లమ్మ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు.ఇటీవల అనారోగ్యంతో మరణించిన వసుకుల ఎల్లమ్మ కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.ఈసందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి మాట్లాడుతూబాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈపరామర్శించిన కార్యక్రమంలో వరంగల్ ఓబిసి చైర్మన్ ఓర్సు తిరుపతి వెంగంపేట మాజీ సర్పంచ్ కట్ల విష్ణు గూడూరు మండల నాయకులు హెచ్ శివ సాయిలు గుగులోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవనం కాపాడాలి

**ప్రజాపక్షం/మంగపేట:**తెలంగాణ అంబేద్కర్ సంఘం మంగపేట మండల అధ్యక్షుడు యెంపెల్లి వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి బోద రామచంద్రయ్య ఆధ్వర్యంలో మంగపేట మండల కేంద్రం లోని ఎస్‌సి కమ్యూనిటీ హాల్ విషయంలో మంగపేట తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. మంగపేట మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ గోదావరి కరకట్టకు వేసిన రోడ్డు వలన సరైన డ్రైనేజి వ్యవస్థ లేక వర్షం పడితే నీరు నిలిచి భవనం కూలిపోయే ప్రమాదం ఉండడం వలన రక్షణ చర్యల గురించి తహసీల్దార్ కలిసి వివరించారు. తహసీల్దార్ తోట రవీందర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కొరకు చర్యలు తీసుకోమని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో అంబేద్కర్ సంఘం మండల నాయకులు గుల్లగట్టు విజయరావు గాజర్ల రాజు, జాడి సాంబశివరావు, బసరికాని నాగార్జున నర్సింహారావు, గుగ్గిళ్ల సురేష్, దాసరి బుజ్జి, దుర్గం శివప్రసాద్, దుర్గం బిక్షపతి పాల్గొన్నారు.

## జఫర్‌గడ్ ఎంపిఒగా శ్రీపాద మధుసూధన్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** జఫర్‌గడ్ మండల పంచాయితి అధికారి (ఎంపీవో)గా శ్రీపాద మధుసూధన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీవో లింగాలఘనపురం మండలానికి బదిలీ కావడంతో అక్కడ పనిచేస్తున్న ఎంపీవో శ్రీపాద మధుసూధన్ జఫర్‌గడ్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా మండల పంచాయితి కార్యాలయ సిబ్బంది నూతన ఎంపిఒకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధి, గ్రామ పంచాయితీల పనితీరు మెరుగుదలకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# మత్స్యకార సహకార సంఘాలను ఆదుకోవాలి

### పోలు కోటేశ్వర్ ముదిరాజ్

**ప్రజాపక్షం/ ఎల్లతుర్తి:** జిల్లాలోని చెరువులను లీజుకు ఇవ్వడం వల్ల మత్స్యకార కుటుంబాల ఉపాధి దెబ్బతింటోందని దీనివల్ల డీలర్లు, కాంట్రాక్టర్లు మాత్రమే లాభపడుతున్నారని కేశవపూర్ గ్రామ మత్స్య సహకార సంఘం అధ్యక్షులు పోలు కోటేశ్వర్ ముదిరాజ్ అన్నారు.బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలోని చెరువులను లీజుకు ఇవ్వడం వల్ల సంప్రదాయంగా చేపల వేటపై ఆధారపడిన మత్స్యకార కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం చేపట్టే చేప పిల్లల పంపిణీ కార్యక్రమం సకాలంలో జరగకపోవడంతో పాటు, సరఫరా చేస్తున్న చేప పిల్లల నాణ్యత కూడా ఆశించిన స్థాయిలో ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.చేప పిల్లల సరఫరాలో జరుగుతున్న జాప్యం కారణంగా వాటి పెరుగుదల ప్రభావితమవుతోందని ఫలితంగా మత్స్యకార సహకార సంఘాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. చెరువుల విస్తీర్ణం ఆధారంగా చేప పిల్లలను పంపిణీ చేయడం బదులుగా సంబంధిత నిధులను నేరుగా మత్స్యకార సహకార సంఘాలకు అందజేస్తే, సంఘాలు తమకు అవసరమైన నాణ్యమైన చేప పిల్లలను సకాలంలో కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుందని సూచించారు.ప్రస్తుతం చేప పిల్లల సరఫరాలో బ్రోకర్లు, దళారులు, కాంట్రాక్టర్లు అధికంగా లాభపడుతున్నారని, నాణ్యత లేని చేప పిల్లలను సరఫరా చేయడం వల్ల సహకార సంఘాలకు ఎనలేని నష్టం కలుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి బ్రోకర్లు, దళారుల ప్రమేయాన్ని అరికట్టి మత్స్యకార సహకార సంఘాలకు నేరుగా ప్రయోజనం చేకూరే విధంగా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.మత్స్యకార కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని సహకార సంఘాలను ఆదుకోవాలని పోలు కోటేశ్వర్ ముదిరాజ్ కోరారు.

# ఇసుక సరఫరాలకు ఇ-సాండ్ బుకింగ్ పోర్టల్

**ప్రజాపక్షం/జనగామ:**నిర్మాణ పనులకు అవసరమైన ఇసుకను పారదర్శకంగా, వేగంగా సులభతరంగా అందించేందుకు జిల్లాలో ఇసాండ్ బుకింగ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. బుధవారం ఈ సాండ్ పోర్టల్ ప్రారంభించి మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడం, ప్రజలకు పారదర్శకంగా ఖనిజాల సరఫరా చేయడం ఇసాండ్ వ్యవస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మీసేవా కేంద్రాలు, తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాలు కలెక్టర్ కార్యాలయంలో ఇసాండ్ పోర్టల్ ఇసుక, గ్రావెల్, మొరం తదితర సామాగ్రిని బుక్ చేసుకోవచ్చునన్నారు. జిల్లాలో ప్రస్తుతం అసుక అందుబాటులో ఉన్న ప్రదేశాల నుంచి ప్రజల అవసరాలకు అనుగుణంగా సరఫరా చేపడతామన్నారు. ఇసుక ధర క్యూబిక్ మీటర్‌కు 450 రూపాయలు, మొరం ధరే 428 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రతి రోజు 32 స్లాట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ పద్ధతిలో నిర్వయించనున్నట్లు తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా ప్రజలకు నాణ్యమైన ఇసుకను నిర్ణీత ధరలకుఅందించడంతో పాటు అక్రమ రవాణాపై సమర్థవంతమైన నియంత్రణ సాధ్యం అవుతుందన్నారు. ప్రజలు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగామ ఆర్‌డిఓ గోపిరామ్, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డిఓ కిరణ్ ప్రకాష్, ఎపిజి శర్మ, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# నిరుపేద పద్మశాలీ యువకుడి అత్యుత్తమ ప్రతిభ

### ఎంసెట్ లో 63వ ర్యాంక్,ఐఐటిలో 900వ ర్యాంక్ * మెయిన్స్ ఓపెన్ కేటగిరిలో 1258వ ర్యాంకు



**ప్రజాపక్షం/హనుమకొండ :** నిరుపేద పద్మశాలి యువకుని ప్రతిభను గుర్తించారు నారాయణ విద్యాసంస్థలు. యువకుని తెలివితేటలు, చదువుల్లో అసాధారణ ప్రతిభను గుర్తించిన నారాయణ విద్యాసంస్థలు యువకునికి ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యను అందించి ఆణిముత్యంగా తీర్చిదిద్దగా శ్రీ వర్ధన్ కు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర, జిల్లా సంఘ నేతలు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లా కాశిబుగ్గకు చెందిన సాంబారి కల్పన చంద్రమోహన్ ల పెద్ద కుమారుడు సాంబారి శ్రీ వర్ధన్ ది నిరుపేద పద్మశాలి కుటుంబం.తండ్రి చంద్రమోహన్ వరంగల్ లోని ఓ చికెన్ సెంటర్లో గుమస్తాగా పని చేస్తుండగా తల్లి గృహిణి.పదవ తరగతి ఫలితాల్లో 10/10 అత్యధిక మార్కులు సాధించగా శ్రీ వర్ధన్ ప్రతిభను గుర్తించిన నారాయణ విద్యాసంస్థలు హైదరాబాదులోని అన్నోజిగూడ సింగపూర్ సిటీ బ్రాంచ్‌లో రెండేళ్లపాటు ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యను అందించారు. చదువుల్లో దిట్ట ఆయన శ్రీ వర్ధన్ ఇటీవల వెలువడిన ఐఐటి ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 900 ర్యాంకు, ఓబిసికేటగిరీలో 154 ర్యాంకు సాధించారు. అలాగే ఎంసెట్ 2026 ఫలితాల్లో 63వ ర్యాంకు, మెయిన్స్ ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 1258వ ర్యాంక్, ఓబిసికేటగిరీలో 220వ ర్యాంక్ సాధించి ఔరా అనిపించాడు. మొదటి నుండి అన్ని సబ్జెక్టుల్లో టాప్ మార్కులతో దూసుకుపోతున్న శ్రీ వర్ధన్ ఇంటర్ ఫలితాలతో పాటు ప్రముఖ పోటీ పరీక్షల్లో జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించి రికార్డ్స్ నెలకొల్పాడు. ఆల్ ఇండియా లెవెల్ లో అత్యధిక మార్కులు సాధించిన శ్రీ వర్ధన్ ను నారాయణ విద్యాసంస్థల అన్నోజీగూడ కోర్ డిన్ చెరుకు రఘుపతి రెడ్డి, ఏజీఎంలు పి అరుణ్ కుమార్, అనిల్ గవాస్కర్ లు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

**ప్రజాపక్షం/గూడూరు;**కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవ్‌రెడ్డి సోదరుడి దివంగత గంట ప్రభాకర్ రెడ్డి ఆకస్మిక మరణం పట్ల గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఈసందర్భంగా బుధవారం కల్వల గ్రామానికి వెళ్లిన కత్తి స్వామి దివంగత ప్రభాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి దు;ఖంలో తాము భాగస్వాములమని పేర్కొంటూ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈకార్యక్రమంలో వరంగల్ ఓబీసీ చైర్మన్ ఓర్సు తిరుపతి వెంగంపేట మాజీసర్పంచ్ కట్ల విష్ణు మండల నాయకులు హెచ్ శివ సాయిలు గుగులోత్ రమేష్ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్యాలయంలో బడిబాట గ్రామసభ

**ప్రజాపక్షం/మహాదేవపూర్;**ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ హసీనాబానో అక్బర్ ఖాన్ అధ్యక్షతన బడిబాట గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ హసీనా బానో మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని అన్నారు.ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య నందిస్తున్నారని,ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ సౌకర్యాలు,ఉత్తీర్ణతా శాతం పెరిగిందని అన్నారు.విద్యార్థులను చేర్పించేలా గడపగడపకు ప్రచారం చేస్తామని అన్నారు.అనంతరం బాలుర,బాలికల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,అనీల్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోనే మహాదేవపూర్ పాఠశాలలు అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాయని,విద్యార్థుల పట్ల తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ ఫలితాలను సాధించేలా చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మహ్మద్,గడ్డం స్వామి,చీర్లవంచ చంద్రశేఖర్,నల్లబూగ సమ్మయ్య,రాజమౌళి,కొండపల్లి రాములు,నయ్యూమొద్దీన్,ఉపాధ్యాయులు సరిత,రాజిరెడ్డి,మద్దుమధు,ప్రభాకర్ రెడ్డి,లీలారాణి,వీరేశం,రజిత,ప్రసూన,గ్రామస్థులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ నమోదు

**ప్రజాపక్షం/భూపాలపల్లి:**జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రంలో ఉన్న గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్న ఫర్టిలైజర్ యజమాన్యంపై పిడి యాక్ట్ కేసు నమోదు చేయాలని సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం బందు సుజాత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ హాజరై మాట్లాడుతూ, జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రంలో ఉన్న గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్న యజమాన్యంపై పిడి యాక్ట్ కేసు నమోదు చేయాలని కోరారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ రేటుకు అమ్మితే విత్తనాలు కొన్న ప్రతి రైతుకు కంప్యూటర్ బిల్లు ఇవ్వాలని గ్రామాల్లో ఉన్న షాపులలో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. పెట్టిన పెట్టుబడి రాక రైతులు ఇబ్బంది పడుతుంటే ఎరువుల ధరలు మాత్రం విపరీతంగా పెంచుతున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఉత్పత్తుల సంతను విజయవంతం చేయండి

### పబ్లిక్ గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సేంద్రియ రైతులను ప్రోత్సహించి వారి ఉత్పత్తులను ఆదరించాలని, అలాగే నిత్యం నడక వంటి వ్యాయామంతో పాటు మిల్లెట్స్‌ను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించవచ్చని పబ్లిక్ గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు రాజిరెడ్డి అన్నారు.నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణం, పబ్లిక్ గార్డెన్స్, హనుమకొండలో జూన్ 5, 6, 7 తేదీలలో నిర్వహించనున్న సేంద్రియ రైతుల సంత ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం పబ్లిక్ గార్డెన్స్‌లో వాకర్స్‌కు నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, రైతులకు సరైన



ప్రోత్సాహం అందించేందుకు వినియోగదారులు సేంద్రియ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. సంత నిర్వాహకులు బయ్య సారయ్య మాట్లాడుతూ, ఈ మూడు రోజుల సంతలో సేంద్రియ ధాన్యాలు, మిల్లెట్స్, కూరగాయలు, పండ్లు, పప్పు ధాన్యాలు, నిత్యావసర వస్తువులు, విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులు తదితర అనేక రకాల సేంద్రియ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.మిల్లెట్ ప్రమోటర్ సంత ముఖ్య సలహాదారులు నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆధునిక జీవనశైలిలో మార్పులు తీసుకువచ్చి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవాలని కోరారు. ముఖ్యంగా మిల్లెట్స్ వినియోగం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు.జూన్ 5 నుండి 7 వరకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించే ఈ సేంద్రియ ఉత్పత్తుల సంతను వాకర్స్, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో సందర్శించి సేంద్రియ ఉత్పత్తుల గురించి తెలుసుకొని అవసరమైన వస్తువులను కొనుగోలు చేసి రైతులను ప్రోత్సహించాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సుంకరి రవికుమార్, పులి హరికృష్ణ, తడక కుమారస్వామి, దాసరి అశోక్, అబ్దుల్ కరీం తదితరులు కోరారు.అనంతరం సంతకు సంబంధించిన కరపత్రాలను వాకర్స్‌కు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు.

## బీరెల్లిలో ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

ప్రజాపక్షం/తాడ్వాయి:తాడ్వాయి మండలం బీరెల్లి గ్రామంలో బొడ్రాయి 3వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఈ పండగను పురస్కరించుకొని గ్రామస్తులంతా కలిసి దేవతా విగ్రహాలకు జలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేసి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలలో స్థిరపడిన ఊరి ప్రజలందరూ తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. బంధుమిత్రులు ఆడబిడ్డల రాకతో బీరెల్లి గ్రామం మొత్తం పండగ శోభను సంతరించుకుంది. సాయంత్రం మైసమ్మ కొలువు బలిహరణ రాత్రి ఊరు కట్టడి చేసారు. గ్రామ దేవత ఆశీస్సులు అందరిపై ఉండాలని, ఊరంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో పాడి పంటలతో విలసిల్లాలని గ్రామ పెద్దలు, ఊరంతా తల్లులను వేడుకున్నారు.

## కాళేశ్వరం పంచాయతీ కార్యదర్శి బదిలీ

ప్రజాపక్షం/కాళేశ్వరం:జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణను మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలానికి బదిలీ చేసారు.ఆయన స్థానంలో పలిమెల మండలంలో పని చేసిన శ్రీధర్‌ను కాళేశ్వరం పంచాయతీ కార్యదర్శిగా నియమించారు.సత్యనారాయణగత నాలుగు సంవత్సరాలుగా కాళేశ్వరం పంచాయతి కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

## బాధిత కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ

ప్రజాపక్షం/పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన కమ్మగాని వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరమని అన్నారు. కష్ట సమయంలో తాము అండగా ఉంటామని ఆయన అన్నారు. ప్రజల కష్ట సుఖాలలో తాను అండగా ఉంటానని ఎవరు అధైర్యపడవద్దని ఆయన అన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులున్నారు.

## చిన్నారులకు బాసటగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్



ప్రజాపక్షం/పాలకుర్తి: మండలంలోని ఎల్లరాయిని తొర్రూర్ గ్రామానికి చెందిన సోమ నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి ట్రస్ట్ తరుపున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని ధైర్యం చెప్పి, బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ హరీష్, కోశాధికారి ఒర్రె కుమారస్వామి, ఉప సర్పంచ్ గోనె కిరణ్ మృతుని కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కొడిశాలలో ఘనంగా 'బడి బాట'...

పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలి: హెచ్ఎం



ప్రజాపక్షం/తాడ్వాయి:మండలంలోని కొడిశాల ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులందరూ తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిలుపునిచ్చారు. కొడిశాల గ్రామంలో హెచ్ఎం కృష్ణరాజు వర్ధన్ ఆధ్వర్యంలో 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం గ్రామ వీధుల్లో విస్తృతంగా పర్యటించారు. ఉపాధ్యాయులు గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ అర్హులైన పిల్లల వివరాలను సేకరించారు. పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో గ్రామంలో ఒక ప్రత్యేక ర్యాలీని చేపట్టారు. ఉచిత సదుపాయాలపై అవగాహన, ఉపాధ్యాయులకు గ్రామస్తులకు, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న రకరకాల ఉచిత సదుపాయాల గురించి అక్కడ లభిస్తున్న అత్యున్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య గురించి గ్రామస్థుల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలు కేవలం పేద విద్యార్థులకే కాకుండా, అందరికీ నాణ్యమైన విద్యను అందించే సరైన వేదికలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన ఊరి బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందంటూ, ప్రభుత్వ బడుల బలోపేతానికి గ్రామంలోని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, స్థానికులు చురుగ్గా పాల్గొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటికి ఆదర్శ విద్యార్థుల ఎంపిక



ప్రజాపక్షం/కాటారం;మండలకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను నిరూపిస్తూ బాసర ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించారు.ఇటీవల పదవ తరగతి పూర్తి చేసిన ఎ మనోజ్ఞ,ఎ ఆరాధ్య,ఎం గౌతమ్ కృష్ణ ప్రతిష్ఠాత్మకమైన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ బాసరలో ఆరేళ్ళ సమగ్ర బీటెక్ కోర్సులో ప్రవేశాలకు ఎంపిక కావడం పట్ల పాఠశాలకు,తల్లిదండ్రులకు గర్వంగా మారింది.విద్యార్థులు సాధించిన విజయంపై పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసారు. సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను అభినందించారు.అనంతరం పాఠశాల చైర్మెన్ జనగామ కరుణాకర్ రావు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం,విద్యార్థుల నిరంతక శ్రమ,తల్లిదండ్రుల సహకార,ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఫలితంగానే విజయం సాధ్యమైందని అన్నారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడబే ఆదర్శ పాఠశాల లక్ష్యమని అన్నారు.విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విధంగా ప్రత్యేక శిక్షణ పోటీ పరీక్షలపై అవగాహన కల్పించడం వ్ల నే వరుస విజయాలు సాధ్యమౌతున్నాయని అన్నారు.ట్రిపుల్ ఐటి ప్రవేశాల్లో ముగ్గురు విద్యార్థులు ఎపిక కావడం పాఠశాల విద్యాప్రమాణాలకు నిదర్శనమని భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కార్తీక్ రావు,ప్రిన్సిపల్ కృషిత,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహిళలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రజా ప్రభుత్వం



ప్రజాపక్షం/జనగామ టౌన్: మహిళలను ప్రజా ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడిపిస్తుందని, కోటి మహిళలు కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. మండలంలోని మరిగడి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళా శక్తి ద్వారా రైతుకు సేవ కేంద్రం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో కోటి మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంగా మహిళలకు పావలా వడ్డీ రుణాలు, సబ్సిడీలో ఫర్టిలైజర్ షాపులు, రైస్ మిల్లులు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్లు, ఇలా అనేక రకాల సంక్షేమ పథకాలు మహిళలకు చేయూతనిచ్చే విధంగా అందిస్తూ మహిళల అభ్యున్నతి కోసం వారు అభివృద్ధి చెందాలని ఈ ప్రజా ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒమహేష్, గ్రామ సర్పంచ్ కర్రె పరుశరాములు, ఎఎంసిడైరెక్టర్ శ్రీనివాస్, ఏపీఎం శంకరయ్య, స్వప్న, మాధవ్ రెడ్డి, గ్రామ కార్యదర్శి ప్రవీణ్, వార్డు సభ్యులు కమలాకర్, మాజీ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, గ్రామ రైతులు, మహిళలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ప్రజాపక్షం/లింగాలఘణపురం:కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని, నెల్లుట్ల గ్రామ సర్పంచ్, సర్పంగ రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని గ్రామంలోని ప్రొఫసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో, బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడిబాట కార్యక్రమానికి సర్పంచ్ రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలన ప్రణాళిక భాగంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ప్రారంభించిన ప్రతిష్ఠాత్మకంగా, మన ఊరు మనబడి కార్యక్రమం నిర్వహించిందని వారు అన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు మన ప్రభుత్వం కల్పించిందని, మన ఊరిలోని గ్రామ ప్రజలు, ప్రభుత్వ పాఠశాలలకు పోయే విధంగా బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో, ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయురాలు సమ్మక్క, వీడీసీ చైర్మన్, బత్తిని అశోక్ కుమార్ గౌడ్, నాయకులు మారబోయిన వేణు, బెల్లంకొండ సోమనాదం, కొయ్యడ సుమన్, దామెర సాయి, లింగమూర్తి, సత్యనారాయణ, విజయ్, ప్రసాద్, నాగరాజు, సాయి, లక్ష్మణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు, భారీ జరిమానాలు

ప్రజాపక్షం/జఫర్‌గడ్: రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు, భారీ జరిమానాలు తప్పవని అళ్వార్ బండ తండా (శంకర్ తండా )సర్పంచ్ బానోత్ అరుణశ్రీ హెచ్చరించారు. గ్రామ పంచాయతీ పరిధిలో తండా వాసులకు తడి పొడి చెత్త నిర్వహణపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో స్వయంగా ప్రజలకు తడి చెత్తను, పొడి చెత్తను ఏ విధంగా వేరు చేయాలో ప్రాక్టికల్‌గా వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే నోటీసులు అందించడం జరుగుతుందని, ఆపై భారీ జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. ఇంటి వద్ద చెత్తను వేరుచేయకుండా నిర్లక్ష్యం వహించినా, లేదా చెత్తను రోడ్లు, డ్రైనేజీలు, బహిరంగ ప్రదేశాలలో పడేసి తండాను అపరిశుభ్రం చేసినా సహించేది లేదని సర్పంచ్ హెచ్చరించారు. తండాను స్వచ్ఛంగా, రోగాల బారిన పడకుండా ఆరోగ్యకరంగా ఉంచుకోవడానికి గ్రామ పంచాయితీ తీసుకుంటున్న ఈ నిర్ణయానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయితీ సిబ్బంది, తండా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## ప్రతి జీవికి జీవించే హక్కు

ప్రజాపక్షం/దేవరుప్పుల: ప్రతి జీవికి జీవించే హక్కు ఉందని, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడం ద్వారా మాత్రమే ప్రకృతిని కాపాడుకోగలమని ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ కార్యదర్శి శ్యాం సుందర్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం అటవీ శాఖ, జిల్లా, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని చిన్న మడూర్ గ్రామంలోని గోపి చెరువులో బర్డ్ వాచ్ (పక్షుల పరిశీలన) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్యాం సుందర్ గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పక్షుల ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్ర, వ్యవసాయ రంగానికి అవి అందించే సేవల గురించి వివరించారు. చిన్నమడూరు గ్రామంలోని గోపి చెరువుకు ప్రతి సంవత్సరం డిసెంబర్, జనవరి నెలల్లో వలస పక్షులు వచ్చి నివాసం ఏర్పరచుకుని సంతానోత్పత్తి చేసిన అనంతరం మే, జూన్ నెలల్లో తమ స్వస్థలాలకు తిరిగి వెళ్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ రేంజ్ ఆఫీసర్ భాస్కర్, సర్పంచ్ మైదం జోగేశ్వర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు జావేద్ హుస్సేన్, రమేష్, సెక్షన్ ఆఫీసర్లు రవీందర్, శోభ, జరీనా, బీట్ ఆఫీసర్లు రమేష్, అంజయ్య, ధర్మరాజు, రవి, పంచాయితీ కార్యదర్శి శివారెడ్డి, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, నాగేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ప్రతి నెలా 1వ తేదీన వేతనం

ప్రజాపక్షం/దేవరుప్పుల: అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్‌కు ప్రతి నెలా 1వ తేదీన వేతనం చెల్లించాలని అంగన్వాడీ టీచర్స్ ఉపేంద్ర, అరుణ కోరుతూ సర్పంచ్ ధరావత్ అనిత రవీందర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత, ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసిన ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ మొత్తం 4131 కేంద్రాలను తక్షణమే రద్దు చేయాలని, ఈ కేంద్రాలను అంగన్వాడీలకు అప్పగిస్తూ వెంటనే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ కరుణాకర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ నాయక్, ఉప సర్పంచ్ హరి నాయక్,కారోబార్ బిక్కు,స్వామి,సిబ్బంది, తదితరులు పాల్గొన్నా రు.

## పాఠశాల ప్రహరీ గోడకు శంకుస్థాపన

ప్రజాపక్షం/లింగాలఘణపురం:మండలంలోని నెల్లుట్ల గ్రామంలోని ఆర్టీసీ కాలనీలోని పాఠశాల కు మండల పరిషత్ నిధులతో, 7,90 రూపాయలతో, పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం పనులకు బుధవారం, సర్పంచ్ నరసింగ రామకృష్ణ, శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, పాఠశాల ఇంచార్జి పద్మ, వార్డ్ మెంబర్స్, కొయ్యడ అనిల్ గౌడ్, వేల్పుల శోభారాణి, కత్తి శ్రీవాణి, బొజ్జం సునీత ప్రభాకర్, నల్ల అజయ్, కోమ్మరాజుల రేణుక కొమురయ్య, తాండ్ర భరత్ శివరాత్రి ఎల్లయ్య, బాల్నే శ్రీరంగ, సామ వీరారెడ్డి పాల్గొన్నారు.

## నతానియల్ మృతి బాధాకరం

### మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి నతానియల్ బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి మెదక్ పట్టణంలోని దయారావీధిలో నతానియల్ నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. నతానియల్ అనారోగ్యంతో మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో సుమారు 12 సంవత్సరాలు పాటు ఆయన అందించిన సేవలను కొనొయాడారు. పార్టీ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, అంకితభావం ఎప్పటికీ గుర్తుడిపోతాయని తెలిపారు. నతానియల్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. అమె వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ గౌడ్, నాయకులు అంజగౌడ్, లింగరెడ్డి, శ్రీను నాయక్, స్వామి నాయక్, యంబిపూర్ మహేష్, రంజిత్ నాయక్ తదితరులు ఉన్నారు.

## గోల్కొండ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ అడ్మిషన్లు ప్రారంభం

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ పట్టణ పరిధిలోని గోల్కొండ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు అర్చన తెలిపారు. కౌన్సిలర్ రాణి బాలరాజ్, ఉపాధ్యాయులు రాజగోపాల్, రజినీ తో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మూడు సంవత్సరాల పైబడిన పిల్లలను చేర్పించినట్లు తలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు లో బుధవారం పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 11వ వార్డు అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, కౌన్సిలర్లు నిరంజన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అట్రాసిటి కేసు విచారణ చేపట్టిన డిఎస్పి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని వెంకటాపూర్ కే గ్రామానికి చెందిన జనగామ స్వామి తేదీ 30న ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేయబడిన ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణలో భాగంగా, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ బుధవారం వెంటాపూర్ గ్రామంలోని సంఘటన స్థలాన్ని సందర్శించి సాక్షులను విచారించారు. అనంతరం పోలీసు సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నా రు. ఈ సందర్భంగా దర్యాప్తు పురోగతి మరియు చట్టపరమైన చర్యల పై అదికారులకు అవసరమైన సూచనలు చేశారు. డీఎస్పీ వెంట రామాయంపేట సిఐ సైదా, నిజాంపేట ఎస్సై రాజేష్, పోలీస్ సిబ్బది తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుంటాం

### రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం / గజ్వేల్:** మండల పరిధిలోని నాలుగు కుటుంబాలకు రు 4 లక్షల ఆర్థిక సహాయాన్ని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ సహకారంతో బుధవారం ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ చేతుల మీదుగా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో అందజేశారు. మాజీ మంత్రి హరీష్ రావు జన్మదింన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీకి చెందిన కుటుంబ పెద్దదిక్కులను కోల్పోయిన వారిని ఆదుకోవాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ స్పష్టం చేశారు. కాగా కోమటిబండ గ్రామ పార్టీ అధ్యక్షుడు శేకు భాస్కర్ రోడ్డు ప్రమాదంలో మరణించగా, వారి సతీమణి శేకు కవితకు అందజేశారు. అలాగే తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ మర్రికింది సుమన్ మరణించడంతో ఆయన భార్యకు, ములుగుకు చెందిన మాజీ ఎంపీటీసీ బొడ్డు ప్రవీణ్ మృతి చెందగా ఆయన భార్య రాధ, కాశిరెడ్డి పల్లి పార్టీ నేత బండారి ఎల్లయ్య మృతి చెందగా ఆయన భార్య బాలమణికి రూ లక్ష చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల్లో భరోసా, ఆత్మస్థైర్యం నింపాలనే లక్ష్యంతో మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన సందర్భంగా ఈ మహత్కార్యానికి శ్రీకారం చుట్టినట్లు మాదాసు శ్రీనివాస్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవిందర్, వైస్ చైర్మన్ పద్మ బాయి నర్సింగ రావు, మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, నేతలు కరుణాకర్ రెడ్డి, నవాజ్ మీరా, బెండే మధు, నూనె కుమార్, మల్లేశం, చంద్రమోహన్ రెడ్డి, రవీందర్ రావు, శ్రీనివాస్ రెడ్డి, యాదవ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, రాంచంద్రం,కిరణ్ చారి, నర్సింలు, అర్జున్ గౌడ్, ఆకుల దేవేందర్, అహ్మద్, శివ కుమార్, మధుసూదన్ రెడ్డి, భీమప్ప పాల్గొన్నారు.

## అధికంగా రసాయన ఎరువులు వాడొద్దు

### రైతులకు అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట్ల రైతు వేదికలో బుధవారం రోజున ఖేతి బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీకాంత్ మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్లో రైతులు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. అదేవిధంగా అధిక మోతాదులో ఎరువుల వాడకం వల్ల జరగబోయే నష్టాలను, అలాగే రసాయనిక ఎరువులు బదులు ప్రత్యామ్నాయ ఎరువులు అయిన మయో ఫెర్టిలైజర్స్, నానో యూరియు, నానో డిఏపి వాడకం వైపు రైతులు తమ ప్రయత్నాలను ప్రారంభించవలసిందిగా సూచించారు. అలాగే రైతులు పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా నేల స్వభావం దెబ్బతిని పంట దిగుబడి తగ్గే ఆస్కారం ఉంది గనుక రైతులు కొయ్యలను కాల్చడం లాంటి చర్యలను విరమించుకోవాలని చెప్పారు. రైతులు స్వల్ప కాలిక పంటలైన పెసలు, మినుములు, కంది పంటలను సాగు చేయడం శ్రేయస్కరమని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, ఏఈఓ శ్రీలత, రమ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చీలపల్లి చోరీ కేసులో మరో నిందితుడి అరెస్ట్

### 142 గ్రాముల బంగారం, 870 గ్రాముల వెండి స్వాధీనం

### మెదక డీఎస్పీ ప్రసన్న కుమార్

**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట :** మెదక జిల్లా పెద్ద శంకరంపేట మండల చీలపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన భారీ చోరీ కేసులో పరారీలో ఉన్న నిందితుడు ఇప్పా సింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 142 గ్రాముల బంగారం, 870 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నట్లు మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. గత నెల చీలపల్లి లో ఐదు ఇళ్లను లక్ష్యంగా చేసుకున్న దొంగలు భారీ మొత్తంలో బంగారం, వెండి అపహరించారు. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితుడు జైరాం జాధవ్‌తో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేసి పెద్ద మొత్తంలో చోరీ సొత్తును రికవరీ చేసిన పోలీసులు, తాజాగా ఇప్పా సింగ్ ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వర్ని, నస్రుల్లాబాద్, ఎల్లారెడ్డి పేట ప్రాంతాల్లో జరిగిన 11 చోరీ కేసుల్లో తన ప్రమేయాన్ని నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. కేసులో మరికొంత చోరీ సొత్తు స్వాధీనం చేసుకునేందుకు గాలింపు కొనసాగుతోందని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన రేణుక రెడ్డి ఎస్ఐ లు ప్రవీణ్ రెడ్డి, శంకర్ పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు విలువైన వస్తువుల భద్రత పై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.

## ప్రైవేట్ పాఠశాల వద్దు.. ప్రభుత్వ పాఠశాల ముద్దు




**ప్రజాపక్షం/వెల్దుర్తి:** వెల్దుర్తి మండల విద్యాధికారి బుచ్చ నాయక్ మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శేరీలా గ్రామంలో బడి బాటలో భాగంగా ఉపాధి హామీ పను లు జరుగుతున్న చోటుకి వెళ్లి గ్రామ సభ నిర్వహించి బడిబాట ప్రచారం చేయడం జరిగింది అని వెల్దుర్తి మండల విద్యాధికారి బుచ్చ నాయక్ తెలిపారు. తల్లిదండ్రులకు విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడము. మా పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, నా ణ్యమైన బోధన, విశాలమైన తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా సౌకర్యాలు మరియు విద్యార్థుల ప్రతిభను వెలికితీసే అనేక కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయి అని ఆయన తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలను కూడా విద్యార్థులకు అందిస్తున్నాము అని అందువల్ల గ్రామంలోని తల్లిదండ్రులందరూ తమ పిల్లలను మా పాఠశాలలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మ ధ్యాహ్న భోజనం మరియు ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు విద్యార్థులకు అందుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, ఉప సర్పంచ్ నవీన్ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి

**ప్రజాపక్షం / గజ్వేల్:** కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని గజ్వేల్ రేంజ్ అటవీ అధికారి వినాయక్ స్పష్టం చేశారు. బుధవారం గజ్వేల్ లో ఆర్డీవో చంద్రకళ చేతుల మీదుగా అటవీ శాఖ పోస్టర్ ఆవిష్కరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిద్దామని అన్నారు. అంతేకాకుండా భూమి, నీరు, వాయు కాలుష్యానికి ప్రాధాన్యత ఇస్తూ భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం సమకూర్చుదామని తెలిపారు. అంతేకాకుండా జంతు సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు పెద్దపీట వేద్దామని చెప్పారు. ప్రకృతిని కాపాడుకుంటేనే అది మనల్ని అన్ని విధాల రక్షిస్తుందని పేర్కొన్నారు. ప్రజా పాలనలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అటవీ అధికారులు పవన్ కుమార్, షెకావత్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జగ్గయ్య గారి శేఖర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ వార్డు సభలను విజయవంతం చేయాలి

### కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంంగా ఈ నెల 4, 6, 8 ,10 తేదీల్లో నిర్వహించే గ్రామ, వార్డు సభలను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ సభలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ఓటరు జాబితా సవరణ, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాల ముందస్తు చర్యలు, మహిళల భద్రత, బాల్య వివాహాల నిరోధం, మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు పంటల అవశేషాలను కాల్చకుండా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వనమహోత్సవం కోసం మొక్కలను సిద్ధం చేయడం, ప్రకృతి విపత్తుల సమయంలో రక్షణ చర్యలపై ప్రజలకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ గ్రామ సభల్లో పోలీసు అధికారులు పాల్గొని ప్రకృతి వైపరిత్యాలు, రహదారి భద్రత, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ పట్టణ సమీపంలోని గిరిజన గురుకుల కళాశాల లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో సిఈ సి, ఒకేషనల్ గ్రూపులలో చేరెందుకు పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్ టిసీ, బోనఫైడ్, కులం, ఆదాయం ఎస్ఎస్‌సి మెమో, కళాశాలలో జూన్ 4వ తేదీ నుంచి సంప్రదించాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని అన్నా రు.

## క్యాన్సర్‌పై మనోధైర్యమే గొప్ప ఆయుధం

### డాక్టర్ రామకృష్ణ ప్రసాద్

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** క్యాన్సర్ వ్యాధికి మనోధైర్యాన్ని మించిన వైద్యం మరోకటి లేదని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి అంకాలజీ నిపుణులు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యశోద ఆసుపత్రిలో రేడియేషన్ అంకాలజీ విభాగంలో హైపర్‌సైట్ సాంకేతికత ద్వారా క్యాన్సర్ కణాలు ఉన్న ప్రాంతానికి రేడియేషన్ అందించటంలో వివరించారు. క్యాన్సర్ పై ప్రజల అవగాహన పెంచేందుకు ప్రత్యేక సదుస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యా ధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇప్పటికే అనేక క్యాన్సర్ రోగులకు విజయవంతంగా చికిత్స అం దించి కోలుకోనేలా చేశామని తెలిపారు. ఈ సమావేశంలో య శోద ఆసుపత్రి ప్రతినిధి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు





**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలో బుధవారం మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతా ప్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, పట్టణ పార్టీ అధ్యక్షులు నవా జ్ మీరా, మాజీ జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం, ఎంపిటిసిల ఫో రం రాష్ట్ర అధ్యక్షులు దేవి రవీందర్ ఆధ్వర్యంలో మొదటగా వాగుగడ్డ శ్రీ హనుమాన్ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హరీష్ రావు జన్మదిన కేకును కట్ చేసి పంచిపెట్టారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, పండ్లు బ్రెడ్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలా గే గ్యార షాహిద్ దర్గాలో పార్టీ శ్రేణులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మాజీ మంత్రి హరీష్ రావు సంపూర్ణ ఆరోగ్యం తో ప్రజాసేవలో నిరంతరం నిమగ్నం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేతలు జాకీయోద్దిన్, వెంకటేష్ గౌడ్, ఆకుల దేవేందర్, రవీందర్ రావు, శ్రీనివాస్ రెడ్డి, మద్ది రాజిరెడ్డి, రమేష్ గౌడ్, కనకయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గజ్వేల్ :** మాజీ మంత్రి హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, నియోజకవర్గ పార్టీ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపా రు. ఈ సందర్భంగా హరీష్ రావును శాలువాతో సత్కరించడంతోపాటు పుష్పగుచ్చం అందజేసి మిఠాయి తినిపించారు. అలాగే మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షులు నవాజ్ మీరా, మాజీ జెడ్పిటిసి రామచంద్రం, మాజీ మంత్రి హరీష్ రావు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాగా హరీష్ రావు జన్మదినం పురస్కరించుకొని దాచారం వెంకటేశ్వర స్వామి ఆలయ అ భివృద్ధికి ప్రతాప్ రెడ్డి రూ. 2 లక్షల విరాళం ప్రకటించారు.

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** సిద్దిపేట శాసన సభ్యులు, మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ ట్రబుల్ షూటర్ తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు మనోహరాబాద్ మండల్ కళ్ళకల్ గ్రామంలోని బంగారమ్మ దేవాలయం వద్ద బుధవారం బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పురం మహేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురం మహేష్ ముదిరాజ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శేఖర్ గౌడ్ లు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి బంగారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతర ం నాయకులంతా కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరీష్ రావు నిరంతర ప్రజాసేవతో, అద్భుతమైన నాయకత్వ పటిమతో తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి, తెలంగాణ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు, తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వ ర్ధిల్లాలని పార్టీ శ్రేణులు కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రీ నాగభూషణం ముదిరాజ్, మెదక్ జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు పంచమి రేణు కుమార్, ఉప సర్పంచ్ మహేష్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్‌లు వెంకటేష్ యాదవ్, మహేందర్ గౌడ్, నాయకులు వర్గంటి రాహుల్ రెడ్డి, కుమార్, నరేష్, సత్యనారాయణ, లక్ష్మ ణ్ సింగ్, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే సునీత రెడ్డి నివాసంలో బుధవారం సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నహీముద్దీన్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్ మండల అధ్యక్షులు శేఖర్, నాయకులు జ్ఞానేశ్వర్, షేక్ హుస్సేన్, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/పాపన్నపేట :** మాజీ మంత్రి, భారాస నాయకుడు సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు బుధవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయం వద్ద ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కంటారెడ్డి తిరుపతి రెడ్డి ఆధ్వర్యం లో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏడుపాయల వన దుర్గా మాత ఆలయంలో హరీష్ రావు పేరున ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అనంతరం రాజగోపురం వద్ద కేక్ కట్ చేసి హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశా రు. ఈ సందర్భంగా కాంటారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ , కన్నీరు ఎక్కడ ఉంటే తన్నీరు అక్కడ ఉండి ప్రజల కన్నీరు తూడుస్తారన్నారు. హరీష్ రావు సూచనల మేరకు నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపిస్తామని పేర్కొన్నారు. కెసిఆర్ నాయకత్వంలో హరీష్ రావు ఉద్యమ ఒక కెరటం గా తెలంగాణ సాధనలో ముఖ్య పాత్ర పోషించారన్నారు. హరీష్ రావు సంపూర్ణ ఆరోగ్య అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శనం చేయాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలాగౌడ్, గురుమూర్తి గౌడ్, సొసైటీ చైర్మన్ మల్లేశం గుప్తా, సర్పంచులు సురేష్, గంటరాణి సుధీర్, నాయకులు దుర్గయ్య, కాశీనాథ్ రావు, శ్రీనివాస్, కొండల్ రెడ్డి, చంద్రమోహన్ గౌడ్, జగదీష్ చారి, కిరణ్ గౌడ్, నవీన్, సాయి, దినేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/రామాయంపేట:** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జన్మదిన వేడుకలు బుదవా రం రామాయంపేట పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. బిఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భ ంగా పార్టీ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మెన్ పల్లె జితెందర్‌గౌడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ బాదె చంద్రం, కౌన్సిలర్లు చౌదరి చరిత, సుప్రబాత్‌రావులు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన నాయకుడు హరీష్‌రావు మరెన్నో జన్మదిన వేడుకలు జ రుపుకొని రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొక్కు ప్రవీణ్, బసన్నపల్లి రా జు యాదవ్, ఉమామహేశ్వర్, ఎస్కే హైమద్, దోమకొండ శ్రీనివాస్, మద్దెల రమేష్, రొయ్యల నవీన్, హస్నోద్దీన్, మద్దూరి బాను చందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా రక్త దాన శిభిరం, ప్రభుత్వాసుపత్రిలో పండ్ల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే చింత ప్రబాకర్ కేక్ కట్ చేసి హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిభిరాన్ని నిర్వహించి సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు,అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా మీడియాతో ఎమ్మెల్యే చింతాప్రబాకర్ మాట్లాడుతూ హరీష్‌రావు సమర్థవంతమైన నాయకుడని కొనియాడారు. అదికార పక్షంలో ఉన్న, ప్రతి పక్షంలో ఉన్న ప్రజల సమస్యలపై అదే స్థాయిలో స్పందిస్తూ పనిచేసే నాయకుడు హరీష్‌రావు అని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సైతం హరీష్‌రావు పనితీరును మెచ్చుకునేవారని అన్నారు. హరీష్‌రావు మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగలని, ఆయురారోగ్యాలతో పాటు మరింత మేదస్సు ,శక్తిని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్బంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టిఎన్‌జిఒ రాష్ట్ర అద్యక్షుడు మామిళ్ల రాజేందర్ డాక్టర్ శ్రీ హరి, మాజీ సిడిసి చైర్మన్ వి జేందర్ రెడ్డి చింత సాయినాథ్; వేణుగోపాల స్వామి, సునీ ల్, జై కౌన్సిలర్లు, మండల పార్టీ అద్యక్షులు, మాజీ ప్రజాప్రతినిదులు , పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సిద్దిపేట :** మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలను సిద్దిపేట జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో వివిధ ప్రాంతా ల్లో అన్నదాన శిబిరాలు, కేక్ కటింగ్, ఆలయల్లో ప్రత్యేక పూజలు, చర్చీలు, మసీదుల్లో సర్వమత ప్రార్తనలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఉత్సాహంగా మాజీ మంత్రి హ రీష్‌రావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు. పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వరాలయం, కోటిలింగేశ్వరాలయంలో మాజీ మంత్రి హ రీష్‌రావు పేరిట ప్రత్యేక అర్చనలు, చర్చీలు, మసీదుల్లో స ర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఎస్‌పిఎల్ వ్యవస్థాపక అధ్యక్షుడు వినోద్ మోదాని ఆధ్వర్యంలో ఆలయంలో అభయజ్యోతి మానసిక వికలాంగుల శిబిరంలో విద్యార్థులకు దుస్తులు పంపిణి, గొడుగుల పంపిణి నిర్వహించారు. మా నసిక విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి, విద్యార్థులకు మధ్యా హ్న భోజనం నిర్వహించారు. మాడ్రన్ బస్టాండ్ వద్ద ప్రజలకు కేక్ కట్ చేశారు. వందలాది మందికి అన్నదానం ని ర్వహించారు. విక్టరీ చౌరస్తాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులకు పంపిణీ చేశారు. లా రీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్ ధర్మవ రం బ్రహ్మం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బిఆర్ఎస్ నాయకులు నందిని శ్రీనివాస్, బెల్లంకొండ వెంకట్, నాయకం వెంకట్, వినోద్ మోదాని, జువ్వన్న ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పట్టణంలో బిఆర్ఎస్ నాయకులు హరీష్‌రావు జన్మదినం పురస్కరించుకొని పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు మచ్చ వేణగోపాల్ రెడ్డి.పాల సాయిరాం, చిప్ప ప్రభాకర్, పూజల వెంకటేశ్వర్‌రావు, మోహన్‌లాల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మంగపేట :** మండలంలో రాజుపేట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు యడ్లపల్లి నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించగా ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి జగదీష్, కేక్ కట్ చేసి స్వీట్ పంపిణీ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మంగపేట మండల మాజీ అధ్యక్షులు, కుదుముల లక్ష్మి నారాయణ, గుండేటి రాజు యాదవ్, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు, యూత్ నాయకులు, వివిధ హోదాలో ఉన్న,బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.






## భక్తుల కోరికలు తీర్చే పనికర పెద్దమ్మ తల్లి

**ప్రజాపక్షం/నెక్కొండ:** గ్రామ దేవతల ఆరాధనలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవం ప్రతిబింబిస్తుంటే, వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పనికర గ్రామంలో కొలువై ఉన్న పెద్దమ్మతల్లి మహోత్సవాలు ఆ భక్తి వైభవానికి సజీవ సాక్ష్యంగా నిలిచాయి. గ్రామ ప్రజల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి ఆలయం బుధవారం తెల్లవారుజాము నుండే భక్తుల రాకపోకలతో కిటకిటలాడింది. డప్పు చప్పుళ్లు, డిజె సౌండ్‌తో గ్రామ మొత్తం మంగళ వాయిద్యాలు, జై పెద్దమ్మతల్లి నినాదాలతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. 2017లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి విగ్రహాన్ని పునః ప్రతిష్ట చేసిన నాటి నుండి ప్రతి ఏడాది భక్తి శ్రద్దలతో అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ మహోత్సవాలు నిర్వహించడం అనవాయితీగా కొనసాగుతోంది. గ్రామంలో 130కు పైగా ముదిరాజ్ కుటుంబాలు నివసిస్తుండగా, ఉత్సవాల నిర్వహణ సౌలభ్యం కోసం నాలుగు ఉడ్డీలుగా ఏర్పడి సామూహికంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నాలుగు ఉడ్డీలకు పెద్దలుగా కోలా వెంకటేశ్వర్లు పొన్నం వెంకన్న, కోలా సతీష్, మెండె వెంకన్న, సింగం కుమార స్వామి, ఎదరబోయిన రాజు, బండారు శ్రీహరి, బండారు రవి బాధ్యతలు నిర్వర్తిస్తూ భక్తులను సమన్వయం చేశారు. గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కుంట సారయ్య, ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన నాగరాజు ఆధ్వర్యంలో మహోత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి చీరలు, చారెలు సమర్పించారు. మొక్కుబడులు తీర్చుకున్న భక్తులు 25 నుండి 30 వరకు గొర్రెలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పేదలకు వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యం

**ప్రజాపక్షం/జనగామ టౌన్ :** పేదలకు వైద్యం అందించడమే నా ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జనగామ పట్టణంతోపాటు జనగామ రూరల్, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల మండలాలకు చెందిన లబ్దిదారులకు మొత్తం రూ.12లక్షల 34 వేల విలువైన 37 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పల్లా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా జనగామ నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్నామన్నారు. రెండున్నర సంవత్సరాలలో ఒక్క సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు కూడా తిరస్కరణకు గురికాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కాన్ సదుపాయం కోసం మంత్రిని తీసుకొచ్చి ప్రారంభించామన్నారు. చేర్యాల, జనగామ ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. జనగామ బిడ్డలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం రెండున్నర సంవత్సరాలలో కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. వచ్చే రెండున్నర సంవత్సరాలలో కూడా ఇదే విధంగా సేవలు కొనసాగిస్తామన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నెక్కొండ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో అమరులైన వీరులకు నివాళులు అర్పిస్తూ, తెలంగాణ అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధి, పారిశుధ్య, ప్రజా సంక్షేమమే గ్రామ పంచాయతీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయతీ సిబ్బంది 36 మందికి సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ చేతుల మీదుగా బ్లౌజ్ పీసులు, జాఫ్రాన్లు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింగం శ్రావణి, గ్రామ పంచాయతీ ఈఓ దయ్యాల సదానందం, వార్డు సభ్యులు మెరుగు విజయ్, భూక్య రవికుమార్, కండిక ఉమ, యాట శ్రావణి, మోటం మౌనిక, మహమ్మద్ అమీర్, చల్లా విష్ణు వర్ధన్, రావుల మధుకర్ రెడ్డి, దేవనబోయిన విజేందర్, రామారావు, శిరీష, కక్కెర్ల విజయ, ముద్రబోయిన శ్రీకాంత్, చొప్పరి జ్యోతి, తదితరులు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా కార్యాలయ ఆవరణలో దేశభక్తి, తెలంగాణ స్ఫూర్తిని ప్రతిబింబించేలా సందడి నెలకొంది. గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు రాష్ట్ర ప్రగతి, అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# కేయూ క్రాస్‌లో ఉచిత మజ్జిగ పంపిణీ




**ప్రజాపక్షం/కేయూక్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం మహిళ ఇంజనీరింగ్ అండ్ సాంకేతిక విద్య కళాశాల వరంగల్ రూసో ఆధ్వర్యంలో కేయూ క్రాస్ లో బుధవారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె భిక్షాలు ప్రారంభించారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు మజ్జిగ కార్యక్రమాన్ని చేపట్టడాన్ని అభినందించారు.మండుటెండలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, బాటసారులు, చిరు వ్యాపారులు ముమ్మ రంగా ఉన్న ఈ ప్రాంతంలో మహిళ సాంకేతిక విద్య కళాశాల నిర్వహించిన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది, ఇంజనీరింగ్ కళాశాల రీసెర్చ్ స్కాలర్స్ అందరూ ఒక సామాజిక కార్యక్రమం చేపట్టాలని ఉద్దేశంతో దాహంతో ఉన్న ప్రజలకు ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ప్రిన్సిపాల్ కె. బిక్షాలు అన్నారు.ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ , సూప రింటెండెంట్ వీరు నాయక్, అధ్యాపకు లు, విద్యార్థులు, బోధ నేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీగా ఫసల్ వాదికి జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు

## న్యూఢిల్లీలో జాతీయ పురస్కారం స్వీకరించిన జిల్లా కలెక్టర్, గ్రామ సర్పంచ్




**ప్రజాపక్షం /సంగారెడ్డి:** సంగారెడ్డి మండలంలోని ఫసల్ వాది గ్రామ పంచాయతి మహిళా సాదికారత, మహిళలకు అనుకూలమైన సేవలు, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రతిభ కనబరిచి ఉమెన్ ప్రెండ్లి థీమ్ కేటగిరిలో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాదించింది. మహిళల సంక్షేమం భద్రత సాదికరతకు ప్రాదాన్యత నిస్తూ చేపట్టిన వినూత్న తతతకార్యక్రమాలు గ్రామాబివృద్ధి లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించే చర్యల ఫలితంగానే ఈ గుర్తింపు లబించింది. ఈ సందర్భంగా బుదవారం న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ పురష్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర పంచాయతీ రాజ్ ,మత్స్య,పశు సంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లాలన్ సింగ్) కేంద్ర సహాయ మంత్రి ఎస్పి సింగ్ బఘేల్ చేతుల మీదుగా ఆవార్డును ప్రదానం చేశారు. సంగారెడ్డి జిల్లా తరుపున జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ,పసల్ వాది గ్రామ సర్పంచ్ హ రి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గోవింద్ శెట్టి ఈ జాతీయ ఆవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీ ఈఓ జానకీ రెడ్డి, డిపిఓ మల్లారెడ్డి, డిఎల్‌పిఓ అనిత ఎంపిఓ శ్రీకాంత్, పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పథకం సద్వినియోగం చేసుకోవాలి

## 125 రోజుల పని చేస్తున్నా కూలి లకు మజ్జిగ ప్యాకెట్ లను పంపిణి

## తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య



**ప్రజాపక్షం/మంగపేట :** మండలంలోని ప్రజలు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంను సద్వినియోగం చేసుకోవాలి అని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య అన్నారు. బుధవారం మంగపేట మండలం కమలాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలి పనులకు వచ్చిన గ్రామ ప్రజలు కూలీలతో మాట్లాడి పలు సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వేసవికాలం దృష్టిలో పెట్టుకొని అందరూ కూడా పలు జాగ్రత్తలు తీసు కొని చల్లగా ఉన్న సమయంలో ఉపాధి హామీ పథకం వినియోగించుకొవాలి అని గుమ్మడి సోమయ్య సూచించారు అదేవిధంగా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అందరూ కూడా పనిని వినియోగించుకోవడం వలన 40 శాతం ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా సిసి రోడ్ల మంజూరు కూడా జరుగుతుందని వారికి తెలియజేశారు. అదేవిధంగా ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్న కొందరికి సంక్షేమ పథకాలు అందడం లేదని కొందరు అంటున్నారు ఇందిరమ్మ ఇల్లు కావచ్చు, పింఛన్ కావచ్చు, ఉచిత కరెంట్ కావచ్చు, రైతు బోనస్ కావచ్చు ఈ పథకాల అర్హత కలిగిన వారు లబ్ధి పొందని వారు ఆయా శాఖల కార్యాలయంలో మరొకసారి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచిస్తూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కచ్చితంగా అందించే విధంగా అధికారులతో మాట్లాడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావు, ఆత్మ డైరెక్టర్ ఇనుగాల కవిత,మండల మహిళా ప్రధాన కార్యదర్శి చింత చంద్రావతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిమ్మల రాంబాబు,తోట అశోక్ కోల శివ అబాబ్స్ రాజు ఎండి మహిమూద్ సదానందం, గ్రామ మహిళా ప్రధాన కార్యదర్శి వడ్లకొండ భాను, మహిళా నాయకురాలు, గోమాస పద్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సిహెచ్ రంజిత్ కుమార్ సంబంధిత పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను గుర్తించింది కాంగ్రెస్ ప్రభుత్వమే



**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి, మలి విడత ఉద్యమాల్లో ప్రాణాలు కోల్పోయిన అమరుల కుటుంబాలు, ఉద్యమాల కారణంగా ఆస్తులు, విలువైన కాలాన్ని కోల్పోయిన ఉద్యకారులను గుర్తించి గౌరవించాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కమిటీని నియమించడం అభినందనీయమని నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల చౌహాన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన నెక్కొండలోని పలు సెంటర్లలో జాతీయ జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ ఫలితాలను రాజకీయంగా వినియోగించుకున్న గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఉద్యమకారుల త్యాగాలను విస్మరించిందని విమర్శించారు. ఉద్యమకారుల సేవలను గుర్తించి వారికి న్యాయం చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందని పేర్కొన్నారు. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి ఉద్యకారుడి త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు స్వాగతించదగ్గవని తిరుమల చౌహాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ హరీష్ రెడ్డి, నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, చల్ల శ్రీపాల్ రెడ్డి, చల్ల రఘోత్తం రెడ్డి, చల్ల కిషన్ రెడ్డి, భిక్షపతి, నరసింహ స్వామి, ఆవుల శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇదునూరి సాయికృష్ణ, జిల్లా పార్టీ నాయకులు కుసుమ చెన్నకేశవులు, మహమ్మద్ షబ్బీర్ అలీ, మార్కెట్ డైరెక్టర్ దొడ్డ విజయ్, సింగం ప్రశాంత్, బాలాజీ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సాయం అందిద్దాం.. కుటుంబానికి అండగా ఉందాం

**ప్రజాపక్షం/భూపాలపల్లి(కొత్తపల్లిగోరి):** జయశంకర్ జిల్లా కొత్తపల్లి గోరి మండల కేంద్రానికి చెందిన కట్ల సతీష్ ముదిరాజ్ (33 సం.) చేపలు పట్టడమే వృత్తిగా చేసుకొని వచ్చిన డబ్బులతో కుటుంబాన్నిపోషించుకుంటున్నాడు.సతీష్ ఎప్పటిలాగే బోక్కు చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లి,ప్రమాదవశాత్తు లోతైన బొందలో వలలు వేస్తుండగా వల కాళ్లకు చుట్టుకుని మరణించారు. ఇతనికి భార్య మౌలిక ఇద్దరు పిల్లలు హన్సిక (9 సంవత్సరాలు),జ్ఞాస్విక (4 సంవత్సరాలు)తల్లి ఉన్నారు.సతీష్ వాళ్ళ నాన్న తన చిన్న తనంలోనే మరణించారు.సతీష్ వాళ్ళ ఇంటి పెద్దగా చిన్నప్పటి నుంచి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఉంటున్న క్రమంలో ఈ విషాదం చోటుచేసుకుంది.ఆర్థికంగా ఏమి లేని నిరుపేద,ఇల్లు కూడా సరిగా లేదు.ఇద్దరు అమ్మాయిలను చదివిస్తూ,కుటుంబాన్ని పోషించుకుంటున్న క్రమంలో ఇలాంటి దురదృష్టకరమైన సంఘటన బాధాకరం. పసిపాపలు ఏడుస్తూ ఉంటే చూసే వారి హృదయం కరిగి కన్నీరు పెట్టినవారే.ఆ చిన్నారుల చిన్న వయసులోనే తండ్రి లేని లోటు ఎవరూ పూడ్చలేనిది.కనీసం జీవిత బీమా పాలసీ కూడా చేసుకోలేని పరిస్థితి.కుటుంబ పోషణ ఎలాగో తెలియని అయోమయ పరిస్థితిలో ఆ కుటుంబం కనిపిస్తోంది.మానవతా హృదయంతో ఈ చిన్నారులకు సహాయం వారి భవిష్యత్తుకు ఉపయోగపడగలరని ఆశిస్తున్నామని మీరు మీ సహాయాన్ని అందించాల్సిన ఫోన్ నెం.8008791400.రేగుల సహదేవ్ కి పంపగలరని మెపా రాష్ట్ర కమిటీ తెలిపారు.

# దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్‌గా డి కృష్ణ ప్రసాద్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ ధార్మిక భవన్‌లో వరంగల్ జోన్ ఉప కమిషనర్ కార్యాలయంలో నూతనంగా నియమించబడిన దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్‌గా డి కృష్ణ ప్రసాద్‌ను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఆదేశాలతో బుధవారం రోజున ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ సునీత నుండి చార్జ్ తీసుకొని పదవి బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ జోన్‌లోని 19 జిల్లాలో ఉన్నటువంటి దేవాలయాలు వారి పర్యవేక్షన అర్చక ఉద్యోగుల సమస్యలు కార్యాలయ సమస్యలను పరిష్కరించడానికి నాకు ఈ బాధ్యతు ప్రభుత్వం అప్పదించిందని తెలిపారు. ఆలయాలలో అక్రమాలను సహించేది లేదని, ఆలయాలు పరిశుభ్రతతో ఉండి భక్తుల మనోభావాలను అనుకూలంగా దేవాలయాలలో పనిచేయాలని దానికి అనుగుణంగా ఉద్యోగులు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు నడుచుకోవాలని దేవాలయ భూముల విషయంలోపన ఎప్పటికప్పుడు దేవాదాయ శాఖ , పై అధికారులు దృష్టికి తీసుకురావాలని, దేవాలయాల భూములు ఎవరు అక్రమించిన కఠిన చర్యలు తప్పవని దేవాదాయశాఖ మంత్రి ఆదేశానుసారం పిడి యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సిబ్బంది అభరణాలు, భూముల విషయం లోపల అప్రమత్తంగా ఉండాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని ఈ సందర్భంగా వచ్చినటువంటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో మాట్లాడుతూ హెచ్చరించారు. ఈ రోజు వారి యొక్క పదవీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసి చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ, భద్రకాళి దేవస్థానం ప్రధాన అర్చకులు బండారు శేషగిరిరావు, టక్కర్ సత్యం, ఎల్లంబట్ల రమేష్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్, అనిల్ కుమార్, లంకా శివకుమార్, భద్రకాళి సూపరింటిండెంట్ విజయ్ కుమార్, కార్యాలయ సూపరింటిండెట్లు రాజ్ కుమార్, గౌరీ శంకర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు వెంకయ్య, నాగేశ్వరరావు, ప్రసాద్, పరిశీలకులు ఎన్ కవిత, సంజీవరెడ్డి, డి అనిల్ కుమార్, వివిధ దేవాలయాల సిబ్బంది పాల్గొని అభినందించారు.

# నిత్యం పూజలతో మానసిక ప్రశాంతత

**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రతినిత్యం దైవ ఆరాధన వల్ల మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగసాన్ పల్లి శివార్ గల శ్రీ ఉమా కేదారేశ్వర క్షేత్రం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి మాసం ప్రత్యేకంగా జరిగే పూజా కార్యక్రమంలో స్వామివారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరమాత్ముడి నిత్యం పూజించడం వల్ల ప్రతి ఒక్కరి పైన ఆ పరమాత్ముడి కృప ఉంటుందని అన్నారు. ప్రతి ఇంటిలో జ్యోతి వెలిగించి పూజలు చేయడం వల్ల మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. స్వామివారికి దిమ్మయ్య గారి భూమయ్య గుప్త దంపతులు పాదపూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో రాజశేఖర్ శర్మ, శ్యాం సుందర్ శర్మ, రామ్ శర్మ, కృష్ణమూర్తి, నరసింహులు గుప్తా, ఇంద్రసేనా రెడ్డి, యాదన్న తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# జైనూర్ ఎఎస్ఐ ముండే ఉద్దవ్ బదిలీ



**ప్రజాపక్షం/జైనూర్ :** జైనూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ముండే ఉద్దవ్‌ను తిర్యాణి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం జైనూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో కలిసి ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. జైనూర్‌లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారంలో ఆయన ఎంతో కృషి చేశారని సిబ్బంది కొనియాడారు. తిర్యాణిలోనూ సమర్థవంతంగా విధులు నిర్వహించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారిపై గేదె మృతదేహం ప్రయాణికులకు ఇబ్బందులు




**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** ప్రధాన రహదారిపై ఉన్న గేదె మృతదేహాన్ని తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని పోతేపల్లి గ్రామ శివారు కాగజ్‌నగర్—పెంచికల్‌పేట్ ప్రధాన రహదారిపై మూడు రోజుల క్రితం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై మృతదేహం అలాగే ఉండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వారికి ఇది ముప్పుగా మారిందని, ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో పర్యావరణ కాలుష్యం, ప్రజారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టాల్సిన గ్రామ పంచాయతీ యంత్రాంగం, సంబంధిత అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి గేదె మృతదేహాన్ని రహదారిపై నుండి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాల భీమ్‌గల్‌లో బుధవారం ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశామని ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని, ఇవే కాకుండా కలాశాలలో ప్రతిఒక్క విద్యార్థి పాఠాలు విని ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచనలు చేస్తూ ప్రతిరోజు క్రమం తప్పకుండా విద్యార్థులు కళాశాలకు హాజరు కావలని సూచించారు.

# సింగరేణి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం / కాసిపేట :** సింగరేణి కార్మికుల పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాసిపేట2 గనిపై టిబీజీకేఎస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గని మేనేజర్ లక్ష్మీ నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కారుకూరి తిరుపతి, సారంగపాణి మాట్లాడుతూ ప్రతి నెల రెండు మెడికల్ బోర్డులను నిర్వహించాలని కోరారు. ఉద్యోగ నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారికి తక్షణమే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని, విజిలెన్స్, మారుపేర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.54 వేల కోట్ల బకాయిలను వెంటనే రాబట్టాలని, కార్మికుల పేర్లపై చెల్లిస్తున్న ఆదాయపు పన్ను మొత్తాన్ని యాజమాన్యమే భరించి తిరిగి కార్మికులకు చెల్లించాలని కోరారు. గైర్హాజరు పేరిట కార్మికులను డిస్మిస్ చేయవద్దని, ఇప్పటికే జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకొని వారిని



తిరిగి విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొత్త బొగ్గు గనుల కేటాయింపు కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని కోరారు. ఈ సందర్భంగా జూలై 7న మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న సింగరేణి పరిరక్షణ సదస్సుకు సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వెంకీ, శివ, యాదగిరి, శ్రీను, కృష్ణ, ప్రభాకర్, మహేందర్, రాజ్‌కుమార్, వెంకటేష్, రాజేష్, తిరుపతి, దీక్షిత్, సతీష్, అనిల్, రమేష్, రాజేశం పాల్గొన్నారు.

# కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం / మందమర్రి :** సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కేంద్ర నాయకులు ఎండి అక్బర్ అలీ, బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న సుమారు 350 మంది డిపెండెంట్లకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డును పాత విధానంలోనే నిర్వహించాలని, పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయ పన్నును యాజమాన్యమే భరించాలని, కార్మికుల సొంతింటి కలను నెరవేర్చే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. యాజమాన్యం పలుమార్లు స్ట్రక్చర్ మీటింగ్‌లు నిర్వహించినప్పటికీ వాటిలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం, యాజమాన్యం కలిసి కార్మిక సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కార్మికుల హక్కుల కోసం పోరాడాల్సిన కొన్ని గుర్తింపు సంఘాలు




యాజమాన్యానికి, ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ కార్మిక వర్గానికి అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) మేనేజర్ సీహెచ్ అశోక్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ బ్రాంచ్ నాయకులు భీమనాథుని సుదర్శన్, ఇప్పకాయ లింగయ్య, తిరుపతి గౌడ్, కంది శ్రీనివాస్, పెద్దపల్లి బానయ్య, ఎగ్గేటి రాజేశ్వరరావు, సీవీ రమణ, పిట్ కార్యదర్శులు గాండ్ల సంపత్, మర్రి కుమారస్వామి, సీహెచ్‌పి శర్మ, హరి రామకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న మొబైళ్లు గుర్తించిన పోలీసులు

**ప్రజాపక్షం / హాజీపూర్ :** హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రెండు మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ సహాయంతో గుర్తించి బుధవారం బాధితులకు అప్పగించారు. హాజీపూర్‌కు చెందిన మల్లేష్, ప్రశాంత్ తమ వీవో కంపెనీకి చెందిన టీ3, టీ4 మోడల్ మొబైల్ ఫోన్లను పోగొట్టుకోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సాంకేతిక పరిశోధన చేపట్టి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోయిన మొబైళ్లను సులభంగా గుర్తించే అవకాశం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక ఆధారాలతో మొబైళ్లను గుర్తించి తమకు అందజేసినందుకు బాధితులు పోలీసుల సేవా దృక్పథాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.



# బ్రతికుండగానే భార్య చిత్రపటానికి అంతిమ నివాళి

**ప్రజాపక్షం / హాజీపూర్ :** భర్తను హత్య చేయించిన భార్య చిత్రపటానికి కుటుంబ సభ్యులు బ్రతికుండగానే అంతిమ నివాళులు అర్పించి దశదిన కర్మ నిర్వహించారు. ఇటీవల హాజీపూర్ మండలంలోని గుడిపేటలో భార్య అక్రమ సంబంధం నేపథ్యంలో భర్తను చంపిన ఘటన రాష్ట్రస్థాయిలో సంచలనం సృష్టించింది. గత నెల 22న జరిగిన సాయిని కుమార్ హత్యతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. గ్రామానికి చెందిన లగిశెట్టి సురేందర్‌తో కుమార్ భార్య భారతీ అక్రమ సంబంధం పెట్టుకుని, భర్తపై ఇన్సూరెన్స్ చేయించి పన్నాగంతో హత్య చేయించింది. ఈ కేసులో నలుగురిని అరెస్ట్ చేసిన హాజీపూర్ పోలీసులు జైలుకు పంపించారు. బుధవారం కుమార్ దశదిన కర్మ సందర్భంగా భర్తను హత్య చేయించిన భార్య భారతీ బ్రతికి ఉన్నప్పటికీ ఆమె చిత్రపటానికి



కూడా కుటుంబ సభ్యులు పిండం పెట్టి అంతిమ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కుమార్ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో రేపు జాబ్ మేళా

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 6వ తేదీన శనివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ శాఖ సహకారంతో కళాశాలలోని ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో బ్రాంచ్ మేనేజర్, కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల భర్తీ నిమిత్తం ఈ మేళా ఏర్పాటు చేస్తున్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే. శ్రీదేవి, జిల్లా ఉపాధి కల్పనాధికారి బి.కిరణ్ కుమార్, కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ విభాగం ఇంచార్జ్ డాక్టర్ లక్ష్మీ నరసింహం పాల్గొన్నారు.

## అగ్నివీర్‌గా ఎంపికైన సాయికి ఘన సన్మానం



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ :** భారత సైన్యంలో అగ్నివీర్‌గా ఎంపికైన పోతేపల్లి గ్రామానికి చెందిన డోకే సాయిని బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పెంచికల్‌పేట్ మండలంలోని పోతేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం పోషన్న ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు సాయిని సత్కరించారు. సాయి తల్లిదండ్రులను కూడా శాలువాలతో గౌరవించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామం నుంచి రెండో ప్రభుత్వ ఉద్యోగిగా ఎంపికైన సాయి సాధించిన విజయాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కష్టపడి చదివి, పట్టుదలతో లక్ష్యాలను సాధించడం ద్వారా మరిన్ని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అగ్నివీర్‌గా ఎంపిక కావడం కుటుంబానికే కాకుండా గ్రామానికే గర్వకారణమని పేర్కొన్నారు. యువతలో సేవ పట్ల ఆసక్తి పెంపొందేందుకు ఇటువంటి విజయాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం పోషన్న, ఉపసర్పంచ్ గిరుగుల చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి రాకేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## బొప్పారం గ్రామానికి పునఃప్రారంభమైన ఆర్‌టిసి బస్సు సేవలు

**ప్రజాపక్షం / కోటపల్లి :** కోటపల్లి మండలంలోని బొప్పారం, నాగంపేట్, కొండంపేట్ ప్రయాణికులకు కొన్ని ఏళ్ల తర్వాత ఆర్‌టిసి బస్సు సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చాయి. బొప్పారం గ్రామానికి వచ్చిన బస్సును సర్పంచ్‌లు జెల్ల సమ్మక్క వెంకటస్వామి, విశాల్ ప్రసాద్ తివారి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ ప్రసాద్ తివారి హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ ప్రసాద్ తివారి మాట్లాడుతూ బొప్పారం గ్రామానికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే రోడ్డు, బస్సు సౌకర్యం కల్పించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ బస్సు సేవలు నిలిచిపోయాయని, ఇప్పుడు మళ్లీ ప్రజా ప్రభుత్వం వచ్చాక మంత్రి చొరవతో బస్సు సౌకర్యాన్ని పునఃప్రారంభించామని తెలిపారు. ప్రజలందరికీ రవాణా సౌకర్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ సేవలు పునరుద్ధరించినట్లు పేర్కొంటూ, మహిళా సోదరీమణులు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని.. విద్య, వైద్యం, రవాణా, తాగునీరు, సాగునీరు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

